సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
బుధవారం । 13 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.17,500
అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.17,500, కనిష్టంగా రూ.8,500 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.45
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.45, కనిష్టంగా రూ.34 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 2,850 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
31.2°/20.8°
జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఆకాశం మేఘావృతమై చాలా ప్రాంతాల్లో వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

21 మండలాల్లో వర్షం



మరువ పారుతున్న గాజులపల్లి చెరువు

పుట్టపర్తి అర్బన్‌: తుపాను ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ జిల్లాలోని 21 మండలాల పరిధిలో మోస్తరు వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మొత్తంగా 106.04 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. అత్యధికంగా నల్లచెరువు మండలంలో 10.2 మి.మీ, పుట్టపర్తి మండలంలో 10 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. అలాగే తాడిమర్రి మండలంలో 9.2 మి.మీ, ఎన్‌పీకుంట 9.0, హిందూపురం 8.4, తలుపుల 6.8, ముదిగుబ్బ 6.4, రొళ్ల 6.4, కనగానపల్లి 4.6, రామగిరిలో 4.2, అగళి 4, లేపాక్షి 4, కదిరి 3.8, చెన్నేకొత్తపల్లి 3.2, గుడిబండ 3 మి.మీ మేర వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. కొత్తచెరువు, ధర్మవరం, గాండ్లపెంట, మడకశిర, తనకల్లు, బుక్కపట్నం మండలాల్లో తుంపర వర్షం కురిసిందని తెలిపారు. తాజా వర్షాలతో పుట్టపర్తి మండలంలోని గాజులపల్లి చెరువు నిండి మరువ పారుతోంది. ఇక సాహెబ్‌ చెరువు, చెర్లోపల్లి చెరువుల్లోకి నీళ్లు చేరాయి.

మడకశిరలో ఎలుగుబంట్ల సంచారం

- భయాందోళనలో ప్రజలు



చౌటిపల్లి వద్ద రెండు ఎలుగుబంట్లు సంచరిస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణ శివారులో ఎలుగుబంట్ల సంచారం ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. మంగళవారం ఉదయం చౌటిపల్లి సమీపంలో ఓ గ్యాస్‌ గోదాము వద్ద రెండు ఎలుగుబంట్లు కనిపించడంతో కలకలం రేగింది. దీంతో స్థానికులు అటువైపు వెళ్లేందుకే భయపడిపోయారు. పట్టణానికి సమీపంలోని కొండపైనుంచి ఎలుగుబంట్లు శివారులోని కాలనీల్లోకి వస్తున్నాయి. ఇటీవలే ఓ ఎలుగుబంటి రాత్రి వేళ పట్టణంలోని ఓ ప్రైవేట్‌ పాఠశాల ఆవరణలో కనిపించిన విషయం తెలిసిందే. ఎలుగుబంట్లు జనావాసాల్లో సంచరిస్తూ భయపెడుతున్నా స్థానిక అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎలుగుబంట్ల బెడదను నివారించడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వీఆర్‌కు ఎస్‌ఐ రాజశేఖర్‌

- ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ రత్న
- విచారణ అనంతరం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని వెల్లడి

సాక్షి ఎఫెక్ట్‌..

పుట్టపర్తి టౌన్‌/ ముదిగుబ్బ: న్యాయం కోసం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన గిరిజన మహిళను లైంగికంగా వేధించడంతో పాటు రాత్రి వేళల్లో నగ్నంగా వీడియోకాల్స్‌ మాట్లాడిన 'పట్నం' ఎస్‌ఐ రాజశేఖర్‌పై వేటు పడింది. పోలీసు స్టేషన్‌కు వచ్చే మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యతాయుత స్థానంలో ఉన్న అతను అమాయక గిరిజన మహిళను వేధించడంతో వీఆర్‌కు పంపుతూ ఎస్పీ రత్న మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ముదిగుబ్బ మండలం గరుగుతండాకు చెందిన ఓ గిరిజన మహిళలను లైంగికంగా వేధించిన రాజశేఖర్‌ గురించి 'సాక్షి' మంగళవారం 'నాతో వస్తే ఓకే... లేదంటే ఇబ్బంది పడతావ్‌.' శీర్షికన వార్త ప్రచురించింది. దీనిపై స్పందించిన ఎస్పీ రత్న వెంటనే అతన్ని వీఆర్‌కు పంపారు. అలాగే ఎస్‌ఐ రాజశేఖర్‌పై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని సంబంధిత పోలీస్‌ అధికారులను ఆదేశించారు. విచారణ అనంతరం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని ఎస్పీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పట్నం ఎస్‌ఐగా జయరాంనాయక్‌
'పట్నం' ఎస్‌ఐగా కె. జయరాంనాయక్‌ను పోలీసు ఉన్నతాధికారులు నియమించారు. దీంతో మంగళవారమే ఆయన బాధ్యతలను చేపట్టారు. లైంగిక వేధింపుల నేపథ్యంలో ఇప్పటి వరకూ పట్నం ఎస్‌ఐగా ఉన్న రాజశేఖర్‌ను వీఆర్‌కు పంపిన ఎస్పీ రత్నం..ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న జయరాంనాయక్‌ను నియమించారు.

మద్యం.. జీవితాలు ఛిద్రం

- విచ్చల విడిగా మద్యం విక్రయాలు
- పట్టపగలే తాగి తూలుతున్న యువకులు
- మత్తులో వాహనాలతో హల్‌చల్‌
- అడ్డొచ్చిన కుటుంబ సభ్యులపైనే దాడులు

సాక్షి, పుట్టపర్తి: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మద్యం విక్రయాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. వీధివీధికీ బెల్టు షాపులు, పల్లెపల్లెకూ మద్యం దుకాణాలు వెలిశాయి. పగలు, రాత్రి తేడా లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు మద్యం దొరుకుతోంది. దీంతో పట్టుమని పాతికేళ్లు కూడా లేని యువత కూడా పట్టపగలే పూటుగా తాగి హల్‌చల్‌ చేస్తున్నారు. కొందరు మద్యం దుకాణాల పక్కనే కునుకు తీస్తున్నారు. మరికొందరు మత్తులో వాహనం నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. పైగా ఎదుటివారిపైనే గొడవకు దిగుతున్నారు. విషయం పోలీసుల వరకూ చేరుతుండగా..చివరకు జైలుపాలవుతున్నారు.

జనావాసాల్లోనే మద్యం దుకాణాలు
కదిరి, కొత్తచెరువు, పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, మడకశిర ఇలా.. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో జనావాసాల మధ్యే మద్యం దుకాణాలు వెలిశాయి. ఏ మద్యం దుకాణం వద్ద చూసినా పక్కనే రూములు, బండలు వేసి మందుబాబులకు వసతి కల్పిస్తున్నారు. ఫలితంగా జనావాసాల మధ్యనే ఉన్న మద్యం దుకాణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలో ఉన్న కూటమి పార్టీల నాయకులు ఒత్తిడి చేస్తుండటంతో అధికారులు కూడా ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు.



మామిళ్లకుంటలో అరటి, చీనీ చెట్ల మధ్య మద్యం సేవిస్తున్న దృశ్యం



కదిరిలో తప్పతాగి ఓ దుకాణం ముందు పడిపోయిన మందుబాబు



కొత్తచెరువులో పట్టపగలు రోడ్డుపైనే పడిపోయిన మందుబాబు

కుటుంబ సభ్యులపైనే దాడి
మంత్రి సత్యకుమార్‌ ప్రాతినిధ్యం వహిస్తున్న ధర్మవరంలో 21 ఏళ్ల యువకుడు మద్యం తాగి ఇంటికి రావడంతో తల్లిదండ్రులు మందలించారు. మత్తులో ఆ యువకుడు కుటుంబసభ్యులపై దాడికి దిగాడు. దీంతో వారు బయటికి పరుగులు తీశారు. పగటి పూట కావడంతో ఇరుకుపొరుగు గమనించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మడకశిరలోనూ వెల్డింగ్‌ షాపులో పని చేసే 17 ఏళ్ల బాలుడు పూటుగా మద్యం సేవించి రాత్రి 11 గంటల సమయంలో ఇతరుల ఇంట్లో చొరబడ్డాడు. బీరు సీసాలతో రెచ్చిపోయాడు. ఇంట్లో ఉన్నోళ్లు భయపడి తలుపులు వేసుకున్నారు. ఉదయాన్నే పోలీసులను ఆశ్రయించారు. మందుబాబుకు పోలీసులు దేహశుద్ధి చేసి వదిలేశారు. ఇక మద్యం మత్తులో కొందరు యువకులు వర్గాలుగా ఏర్పడి దాడులకు దిగుతున్నారు. ఇది ఒక్కోసారి పెద్ద గొడవగా మారి ముష్టి యుద్ధాలను తలపిస్తున్నాయి.



పుట్టపర్తి సూపర్‌ స్పెషాలిటీ సమీపంలో వెలిసిన మద్యం దుకాణం పరిసరాల్లో సిట్టింగ్‌ ఇలా..

రోడ్ల పక్కనే కునుకు

సమయపాలన లేకుండా.. ఎలాంటి షరతులు వర్తించకుండా.. ఎక్కడపడితే అక్కడ ఏ సమయంలో అయినా సరే మద్యం లభిస్తోంది. దీంతో మందుబాబులు తప్పతాగి ఇంటికి వెళ్లలేని స్థితిలో రోడ్ల పక్కనే కునుకు తీస్తున్నారు. ఇలాంటి ఘటనలు కొత్తచెరువు, కదిరి, పుట్టపర్తిలో వెలుగు చూశాయి. మందుబాబులు పట్టపగలే రోడ్లపై కునుకు తీస్తున్న ఫొటోలు సోషల్‌ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిలోనూ మద్యం దుకాణాల పక్కనే వసతి కల్పించడంతో మందుబాబులు అక్కడే తాగి చుట్టుపక్కల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

నేడు రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక

సాక్షి, పుట్టపర్తి: ఇప్పటికే మూడుసార్లు వాయిదా పడిన రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక బుధవారం రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

పారని పాచిక
ఎంపీపీ పదవికి పోటీ చేసేందుకు అభ్యర్థి లేకున్నా.. సొంత మండలంలో పీఠం దక్కించుకోవాలని పరిటాల సునీత పావులు కదుపుతున్నారు. అయితే ఇప్పటికే మూడుసార్లు ఎన్నికలకు నోటిఫికేషన్‌ ఇచ్చినా.. పరిటాల సునీత పాచిక పారలేదు. దీంతో ఎంపీపీ పీఠం కోసం మరోసారి ఎన్నికలకు అధికారులు నోటిఫికేషన్‌ ఇచ్చారు. బుధవారం నాల్గోసారి రామగిరి ఎంపీపీ పదవి కోసం ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. టీడీపీ నేతలు చేస్తోన్న అరాచకాలతో ఈసారి కూడా ఎంపీపీ ఎన్నికకు సభ్యులు హాజరు కాకపోవచ్చని తెలుస్తోంది. ఫలితంగా మరోసారి వాయిదా పడే అవకాశం ఉంది.

బలం లేకున్నా.. పీఠంపై గురి
రామగిరి మండలంలో పది ఎంపీటీసీ స్థానాలుండగా.. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో 9 చోట్ల వైఎస్సార్‌సీపీ జయకేతనం ఎగుర వేసింది. టీడీపీ ఒక స్థానంలో సరిపెట్టుకుంది. ఎంపీపీ స్థానం మహిళకు రిజర్వ్‌ కావడంతో రామగిరి ఎంపీటీసీ సభ్యురాలిగా గెలిచిన మీనుగ నాగమ్మను వైఎస్సార్‌ సీపీ ఎంపీపీ పీఠంపై కూర్చోబెట్టింది. అయితే ఆమె హఠాన్మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ బలం ఆరుగా ఉంది. టీడీపీ సభ్యుడి జతకు పార్టీ ఫిరాయించిన మరో ఇద్దరు చేరారు. ఫలితంగా టీడీపీ సంఖ్య మూడుకు చేరింది. ఇంకో స్థానం ఖాళీగా ఉంది. పార్టీ ఫిరాయించిన వారిలోనూ ఒకరు జనసేనలోకి వెళ్లారు. అయితే టీడీపీకి మద్దతుగా ఉన్న వారిలో ఒక్కరు కూడా మహిళ లేకపోవడంతో పోటీ చేసేందుకు అభ్యర్థి లేక.. పరిటాల సునీత దిక్కులు చూస్తున్నారు. అయితే బలవంతంగా ఎవరో ఒకరికి కండువా వేసి ఎంపీపీ పదవి కట్టబెట్టి జెండా ఎగరవేయాలని ప్లాన్‌లో ఉన్నట్లు తెలిసింది.



గతంలో ఎంపీపీ ఎన్నిక వాయిదా పడటంతో బాణసంచ కాలుస్తూ టీడీపీ నేతల సంబరాలు(ఫైల్‌)

రచ్చ చేసి.. వాయిదా వేసి..
ఎంపీపీ ఎన్నిక ఇప్పటి వరకు మూడుసార్లు వాయిదా పడింది. దీంతో నాల్గోసారి నోటిఫికేషన్‌ వదిలారు. ప్రతిసారీ టీడీపీ నేతలు రచ్చ చేస్తుండటంతో వాయిదా పడుతూ వస్తోంది. సామరస్యంగా.. ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాల్సిన ఎన్నికను రచ్చ చేసి.. తమ వైపు తిప్పుకోవాలని చూస్తుండటంతో వాయిదా పడుతూ వస్తోంది.

లేఔట్ల క్రమబద్ధీకరణకు అవకాశం

- అక్టోబర్‌ 24 వరకు దరఖాస్తుకు గడువు

పుట్టపర్తి టౌన్‌: జిల్లాలోని అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. గత జూలై 28న ప్రభుత్వం విడుదల చేసిన జీఓ మేరకు లేఔట్‌ రెగ్యులరైజేషన్‌ స్కీమ్‌ (ఎల్‌ఆర్‌ఎస్‌)లో భాగంగా లేఔట్లను క్రమబద్ధీకరించనున్నారు. అక్టోబర్‌ 24వ తేదీ వరకూ దరఖాస్తుకు గడువు విధించారు. ప్రస్తుత మార్కెట్‌ విలువ ఆధారంగా చార్జీలు ఉంటాయి. సాధారణంగా లేఔట్లలో 10 శాతం రిజర్వ్‌ స్థలాన్ని వదలకపోతే మార్కెట్‌ విలువ ఆధారంగా 14 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. 10 శాతం రిజర్వ్‌ స్థలం వదిలి ఉంటే 2 శాతం ఫీజు చెల్లించాలి. ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారు 45 రోజుల్లోపు మొత్తం చార్జీలు చెల్లిస్తే 10 శాతం రాయితీ ఇస్తారు. నిర్దేశించిన 9 రోజుల్లోపు చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన 14 శాతం ఫీజులో 80 శాతం రాయితీ వర్తిస్తుంది. కాగా, ఎల్‌ఆర్‌ఎస్‌ ద్వారా అనధికార లేఔట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పుట్టపర్తి మున్సిపాలిటీ కమిషనర్‌ కాంత్రికుమార్‌ పిలుపునిచ్చారు. క్రమబద్ధీకరణ చేసుకున్న లేఔట్లలో మున్సిపాలిటీ తరఫున బాధ్యతగా అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పిస్తామన్నారు. దీనికి తోడు భవన నిర్మాణాలకు అనుమతులు సులవుగా పొందవచ్చునని పేర్కొన్నారు.

బాబు మోసాలను ఊరూరా వివరిద్దాం

- వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌ పిలుపు



గోరంట్లలో 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉషశ్రీ చరణ్‌

గోరంట్ల: అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఆ తర్వాత అన్ని వర్గాలను మోసం చేసిన తీరును ఊరూరా వివరిద్దామని వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్‌ పిలుపునిచ్చారు. కూటమి పార్టీల నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను ఏ విధంగా మోసం చేశారో ప్రతి ఇంటికి వెళ్లి వివరించి ప్రజలను చైతన్యవంతులను చేయాలని పార్టీ శ్రేణులకు ఆమె పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని బూదిలి, మల్లాపల్లి, గౌనివారిపల్లి, మలసముద్రం, కొండాపురం, గోరంట్లలో 'బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఉషశ్రీచరణ్‌ మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్‌ నెరవేర్చలేదన్నారు. పైగా హామీలన్నీ అమలు చేశామంటూ గొప్పలు చెబుతున్నారని మండిపడ్డారు. ఏడాది మూడు సిలిండర్లు ఇస్తామన్న కూటమి నేతలు...ఒక్క సిలిండర్‌ కూడా ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. 'తల్లికి వందనం' అమలులోనూ నిబంధనల పేరుతో అర్హులకు పథకం అందకుండా చేశారన్నారు. అలాగే 'అన్నదాత సుఖీభవ' కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చినా... 14 నెలలల తర్వాత అరకొరగా అందించి చేతులు దులుపుకున్నారన్నారు. ఇక నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే బీసీలకు పింఛన్‌, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్న హామీలేవీ అమలు చేయకుండా అందరినీ మోసం చేశారన్నారు. కానీ 14 నెలల పాలనలో రూ.140 వేల కోట్లు అప్పు చేసి కూటమి నేతలు జేబులు నింపుకున్నారని ఉషశ్రీ చరణ్‌ మండిపడ్డారు. 'హామీల అమలు ఎప్పుడు బాబూ' అని ప్రశ్నిస్తున్న వైఎస్సార్‌ సీపీ నేతలు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తూ గొంతునొక్కుతున్నారన్నారు.

పులివెందులలో ప్రజాస్వామ్యం ఖూనీ
పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో కూటమి నేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఉషశ్రీచరణ్‌ మండిపడ్డారు. అధికారం అండతో అరాచకాలకు పాల్పడ్డారన్నారు. కూటమి నేతలు బరితెగించి స్థానికేతరులతో ఓట్లు వేయిస్తున్నా... వైఎస్సార్‌ సీపీ పోలింగ్‌ ఏజెంట్లపై దాడులు చేస్తున్నా పోలీసులు కూడా చూస్తూ ఊరుకోవడం దుర్మార్గమన్నారు. గతంలో నంద్యాల అసెంబ్లీ ఉప ఎన్నికల్లోనూ టీడీపీ ఇలాగే వ్యవహరించిందని, ఆ తర్వాత కొన్ని నెలలకే అబాసుపాలైన సంగతి ఆమె గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ వెంకటేశు, పట్టణ కన్వీనర్‌ మేదర శంకర, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, పార్టీ సీనియర్‌ నాయకుడు గంపల వెంకటరమణారెడ్డి, పార్టీ జిల్లా ట్రెజరర్‌ బాలన్నగారిపల్లి రామకృష్ణారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ముఖ్యనాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

త్రివర్ణ పతాకంతో ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

లేపాక్షి: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని లేపాక్షిలోని ఓరియంటల్‌ ఉన్నత పాఠశాల, ఏపీ గురుకుల పాఠశాలల విద్యార్థులు 600 అడుగుల తివర్ణ పతాకాన్ని మంగళవారం ఉదయం ర్యాలీగా ప్రదర్శించారు. నంది విగ్రహం వరకూ ర్యాలీ కొనసాగింది. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని, ప్రతి ఒక్కరిలో దేశభక్తి నెలకొల్పాలన్న ప్రధాని నరేంద్రమోదీ ఆశయమే హర్‌ ఘర్‌ తిరంగా లక్ష్యమని ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

కదిరి టౌన్‌: రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు వ్యవసాయ, కార్మిక రంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్‌ చేశారు. మంగళవారం కదిరిలో జరిగిన సీపీఎం 14వ జిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా మహాసభలకు విచ్చేసిన ప్రతినిధులతో కలసి సీపీఎం జిల్లా కార్యదర్శిగా రామకృష్ణతో పాటు 11 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్‌, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

'డైట్‌' సూపరింటెండెంట్‌గా ఇక్బాల్‌

అనంతపురం ఎడ్యుకేషన్‌: బుక్కపట్నం డైట్‌ కళాశాల సూపరింటెండెంట్‌గా ఎండీ ఇక్బాల్‌ను నియమిస్తూ పాఠశాల విద్యా రీజనల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ శామ్యూల్‌ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురంలోని సమగ్రశిక్ష కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎండీ ఇక్బాల్‌ను ఇటీవల సరెండర్‌ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన్ను డైట్‌ కళాశాలకు బదిలీ చేశారు. ఇక అనంతపురం సమగ్ర శిక్ష కార్యాలయ సూపరింటెండెంట్‌గా చిత్తూరు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయ సీనియర్‌ అసిస్టెంట్‌ ఎంకే కృష్ణారావు నియమితులయ్యారు. ఈ క్రమంలో మంగళవారం ఇక్బాల్‌ బాధ్యతలు స్వీకరించగా, ఎంకే కృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ఇక సమగ్రశిక్ష కార్యాలయంలో సీనియర్‌ అసిస్టెంట్‌గా పని చేస్తూ రీప్యాట్రేషన్‌ అయిన హాజీవలిని శ్రీసత్యసాయి జిల్లా డీఈఓ కార్యాలయానికి బదిలీ చేశారు.